క్లుప్తంగా

సీఐ పైడపునాయుడు బాధ్యతల స్వీకరణ



సీఐ పైడపు నాయుడు

కె.కోటపాడు : కె.కోటపాడు సీఐగా పి.పైడపునాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి రూరల్ సీఐగా పనిచేస్తున్న పైడపునాయుడు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.కోటపాడు సర్కిల్ పరిధిలో గల అన్ని గ్రామాల్లో పోలీస్ సిబ్బందిని సమన్వయం చేస్తూ శాంతి భద్రతలను కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. పైడపునాయుడును కె.కోటపాడు, ఎ.కోడూరు, దేవరాపల్లి, మాడుగుల ఎస్ఐలు ఆర్.ధనుంజయ్,రమేష్,టి.మల్లేశ్వరరావు, నారాయణరావు కలిసి అభినందనలను తెలిపారు.

ఘనంగా మరిడి మహాలక్ష్మి తల్లి పండగ

నాతవరం: మండలంలోని గన్నవరంలో శ్రీమరిడిమహాలక్ష్మి అమ్మవారు పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి తెల్లవారు జామునుంచే భక్తులు బారులు తీరారు. మహిళలు పసుపు కుంకమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉచితంగా తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పండగ సందర్భంగా కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా మరిడిమాంబ జాతర

గొలుగొండ: పాతకృష్ణదేవిపేట గ్రామంలో గురువారం మరిడిమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

దేవరాపల్లి: మండలంలోని బేతపూడి కేజీబీవీలో విద్యార్థినుల కోసం దేవరాపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కె.కోటపాటు సీహెచ్‌సీ గైనకాలజిస్టు డాక్టర్ కుసుమ రాణి, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన 250 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 69 మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించి మందులు అందజేశారు.

మాకవరపాలెం: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, వ్యాధులతో బాధపడుతున్న వారికి డాక్టర్ ఝాన్సీరాణి మందులు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవిద్య, పాఠశాల ఎస్‌వో త్రివేణి, హెల్త్ అసిస్టెంట్ శివ,ఏఎన్ఎం ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఎస్‌టీసీ స్కూళ్లు మంజూరు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి, పీత్రుగెడ్డ గ్రామాలకు ఎన్ఆర్ఎస్‌టీసీ సూళ్లు మంజూరైనట్టు ఎంఈవోలు జానుప్రసాద్, పి.జగ్గారావు తెలిపారు. ఈ స్కూళ్లలో విద్యాబోధన చేసేందుకు ఆసక్తి గల డీఎడ్, బీఎడ్ విద్యార్హతలు కలిగిన వారు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

మాలల సదస్సును విజయవంతం చేయాలి

దేవరాపల్లి:ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ఈ నెల 8న అనకాపల్లిలో నిర్వహించే మాలల సదస్సును విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట మండల కమిటీ నాయకులు కోరారు. దేవరాపల్లిలో గురువా రం జరిగిన సమావేశంలో మండల నాయకుడు పరవాడ అప్పారావు మాట్లాడుతూ మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నాతవరం: స్థానిక సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బేకర్ నిర్మాణ పనులు నిమిత్తం ఈనెల 6న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు నర్సీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు వి.డి.వి రామకృష్ణ తెలిపారు. నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, చిక్కుడుపాలెం, గుమ్మడిగొండ, చమ్మచింత, వల్సంపేట, మాధవనగరం, డి.యర్రవరం, జిల్లేడుపూడి, మన్యపురట్ల, లింగంపేట, లక్ష్మీపురం, తాండవ, ములగపూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మంగతాయారు అన్నారు. గొట్లాంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంగతాయారు మాట్లాడుతూ పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మేలు జరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుభ్యోనమః

గురువు తల్లి,తండ్రి,దైవంతో సమానం అనేది ఆర్యోక్తి. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దే బాధ్యత వారిదే.ఎంతో మంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, పోలీసు అధికారులుగా, రాజకీయ నాయకులుగా తీర్చి దిద్దిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుంది. విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది. అలాంటి ఉపాధ్యాయులను గురుపూజోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో ఘనంగా సన్మానించారు.

- ఘనంగా టీచర్స్ డే
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



అవంతి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

• సేవలకు పురస్కారాలు







అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్,డీఈవో, ఎమ్మెల్యే కొణతాల చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న అప్పలరాజుపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఆదారి శ్రీనివాసరావు, ఎ.కోడూరు హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు జె.అమృతరావు, పాచిలవానిపాలెం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.వీరాంజనేయులు

–చీడికాడ, కె.కోటపాడు

దేవరాపల్లి: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో గురువారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు ఎంఈవో-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి. ఉషారాణి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్యవెంకట రమణతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బోయిలకింతాడ హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఈ.మల్లేశ్వరరావు దంపతులను ఎంపీపీ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మండల స్థాయిలో 8మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఎంపీపీ బుల్లిలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ వేడులకు నౌడు అప్పారావు మాస్టారు అధ్యక్షత వహించారు. ఎ.కొత్తపల్లి హైస్కూల్‌లో హెచ్ఎం వై.స్వర్ణలత, కాశీపురం హైస్కూల్‌లో హెచ్ఎం టి.బి.టి. సుందరి ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మాకవరపాలెం: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టీచర్స్ డే వేడుకల్లో ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కె.రామును తోటి ఉపాధ్యాయులు సత్కరించారు.

నాతవరం: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల తర్వాత గురువు కీలకమన్న విషయాన్ని గ్రహించాలని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు స్థానిక కల్యాణమండలంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంఈవో వరహాలబాబును, విశ్రాంతి ఎంఈవో తాడి అమృత్‌కుమార్‌ను, ఇటీవల పదవీ విరమణ చేసిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో వరహాలబాబు మాట్లాడుతూ గురువులను సత్కరించుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. ఈకార్యక్రమంలో విశ్రాంతి ఎంఈవో అమృత్‌కుమార్, సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, గోవిందరావు, ఎంఆర్‌సీ ఉద్యోగులు అంకంరెడ్డి శ్రీనివాసనాయుడు, సాంబ, నాయుడు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలను కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఉపన్యాసకులను విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, సీనియర్ ఉపన్యాసకులు ఎస్.ఎం.రఫీయుద్దీన్, హెచ్.సుధీర్, వి.అప్పల నాయుడు, ఐ.వి.వి. సత్యవతి మాట్లాడారు. లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆదిగణపతినాయుడు, మాజీ సర్పంచ్ శిరిసోళ్ళ సత్యారావు, పాఠశాల కమిటీ చైర్మన్ బొండా నరసింగరావు,పూర్వ చైర్మన్ భూతనాథు రామారావు, ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.జగన్నాథరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

కె.కోటపాడు : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చౌడువాడ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాట్ల తాతరాజు, ప్రధానోపాధ్యాయుడు దీవి అప్పలకొండ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని 68 పాఠశాలల్లో గురుపూజోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణతో పాఠాలు చెప్పారు. పలువురు విద్యార్థులు తమ గురువులను ఘనంగా సత్కరించారు.

మాడుగుల రూరల్ : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థినీవిద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం వి.దాసుతో పాటు ఇతర ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. అంతకు ముందు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కర్రి సంతోష్, కమిటీ సభ్యులు ఉపాధ్యాయులును సన్మాంచారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపాటల పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

రోలుగుంట: మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో ఎంఈవో-1 జానుప్రసాద్, ఎంఈవో-2 పి.జగ్గారావులను సీఆర్పీ పరవాడ సతీష్,సిబ్బంది శ్రీనివాసరావు, వేణు, రుత్తల సత్తిబాబు సత్కరించారు.

నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్(తురకబడి) ఉపాధ్యాయులను యూనియన్ బ్యాంక్ మేనేజర్ దీపక్, నవీన్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. స్థానిక కోర్టులో కొన్నేళ్లుగా సేవలు అందిస్తున్న ఎనిమిది మంది న్యాయవాదులను గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్ ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కోర్టు ఏర్పాటైన దగ్గర నుంచి సేవలు అందించి దివంగతులైన 26 మంది న్యాయవాదుల చిత్రపటాలను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్టా ప్రభాకర్, శివకృష్ణ ఆవిష్కరించి సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. రిటైర్డ్ జడ్జి ఎం. రామశేషగిరిరావు న్యాయవాద వృత్తిలో మెలకువలను వివరించారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గబ్బాడ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు కె.సోమేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తురకబడి) పీఎస్ టీచర్ ఎల్.సుగుణ, వాకర్స్‌క్లబ్‌లోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ట్రెజరర్ అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులు ఎం.వి.రంగారావు, కుప్పిలి స్వామి, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబీ, వి.గజ్జలమ్మ తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో ఉపన్యాసకులను సత్కరిస్తున్న విద్యార్థులు



లక్ష్మీపురంలో గురువులకు సత్కారం



ఎంఈవో వరహాలబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను క్లబ్ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఇతర ప్రతినిధులు వెలగా నారాయణరావు, వూడి అప్పారావు, కుప్పిలి స్వామి, కర్రి రామ్‌గోపాల్ సన్మానించారు.



తూటిపాలలో హెచ్ఎం రామును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ఉపాధ్యాయలను సన్మానిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు



చౌడువాడలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



న్యాయవాద దంపతులను సన్మానిస్తున్న న్యాయమూర్తులు పఠాన్ షియాజ్ ఖాన్, రోహిత్



కె.జె.పురం హైస్కూలులో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు



ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్ గురుపూజోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



వడ్డాది మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న దేవరాపల్లి ఎంపీపీ బుల్లి లక్ష్మి



రోలుగుంటలో ఎంఈవోలను సత్కరిస్తున్న సీఆర్పీలు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సన్యాసిపాత్రుడు, క్లబ్ ప్రతినిధులు



నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బ్యాంక్ మేనేజర్ దీపక్

ఘనంగా పసలమారమ్మ పండగ

చీడికాడ: పశువులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ వరినాట్లు అనంతరం చేసే పసలమారమ్మ పండగను గురువారం ఖండివరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేర్లలో ఉన్న పసలమారమ్మ పుట్ట వద్దకు డప్పులు, వాయిద్యాలతో రైతులు, మహిళలు ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోసూరి సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వర్షాలు

మాడుగుల రూరల్: మండలంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. తాచేరు, పెద్దేరు, శారద నదుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి, గురువారం కురిసిన వర్షాల కారణంగా మండలంలోని చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. పాలగెడ్డ, చింతగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలతో మెట్ట భూముల్లో వరినాట్లు పూర్తవుతాయని మండల వ్యవసాయాధికారి తెలిపారు.

సకాలంలో వైద్యసేవలందేలా చర్యలు

ఎంపీపీ జగన్‌మోహన్



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రజలకు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున సకాలంలో వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. గురువారం జరిగిన చౌడువాడ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, పాము, కుక్కకాటు వ్యాక్సిన్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆస్పత్రిలో సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి నిర్మల, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులవాణి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

దేవరాపల్లి: మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే పీఎం జన్‌మన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఈఎల్‌డీవో ఎస్.మంజుల వాణి అన్నారు. సమ్మెద, చింతలపూడి గ్రామాల్లో పీఎం జన్‌మన్ సదస్సులు స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ అధ్యక్షతన గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో వసతుల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎంపీడీవో కె.చంద్రశేఖర్, స్థానిక ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు, విద్యుత్ శాఖ ఏఈ కె. శంకరరావు, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, వెలుగు ఏపీఎం ప్రభాకర్ , ఏపీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జనమన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. జేడీపేట పంచాయతీ ఎల్. గవరవరంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి అధ్యక్షత జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్, ఐసీడీఎస్ పీవో సీహెచ్. శ్రీదేవి. పంచాయితీ కార్యదర్శి వెచ్చా రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

మండల ప్రత్యేకాధికారి లక్ష్మి



అధికారులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మి

నాతవరం: మండలంలోని ప్రధాన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. తుపాను నష్టాలను శాఖల వారీగా నివేదించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సచివాలయాల్లో అందబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేయించాలని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల సమయ పాలన విషయంలో ఎంపీడీవో ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల ద్వారా ఆదాయం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయ శ్రీ

నాతవరం: పంచాయతీలకు ఆదాయం లభించే మార్గాలపై అన్వేషించాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ అన్నారు. నాతవరం పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో ప్రధాన సమస్యలను పంచాయతీ కార్యదర్శి శ్రీనుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు. నాతవరం, మర్రిపాలెం పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణవల్ల అదనపు ఆదాయం లభించడంతో పాటు గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు

రోలుగుంట: ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ చందు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో కొవ్వూరులో గురువారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. మండల కౌన్సెలర్ మలసాల గణేష్, హెచ్ఎం దేముడుబాబు, పీహెచ్‌సీ సిబ్బంది కన్నబాబు, ఎంఎల్‌పీహెచ్ నూకరత్నం, మహిళా సంరక్షణ కార్యదర్శి గొల్లు వరలక్ష్మి పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

దేవరాపల్లి: స్థానిక అంబేద్కర్ కాలనీలో నిర్మించిన స్వచ్ఛ భారత్ మరుగుదొడ్లను సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి ప్రారంభించారు.